ప్రజాశక్తి
సోమవారం 13 మే 2024 1
అనంతపురం శ్రీ సత్యసాయి






◆ ఓటేసేందుకు జనం.. నిర్వహించేందుకు అధికారులు సిద్ధం..!
◆ నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓట్ల పండుగ
◆ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
◆ ఆదివారమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పోలింగ్‌కు.. రెడీ..!

సార్వత్రిక ఎన్నికల సమరం తుది ఘట్టానికి వచ్చేంది. నాయకుల తలరాతలను నిర్ణయించే పోలింగ్ సోమవారం నాడు జరగనుంది. పోలింగ్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయుధ బలగాల పర్యవేక్షణలో, సాంకేతిక నిఘా నీడలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి సమస్యాత్మక ఘటనలూ చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు భద్రతా చర్యలనూ తీసుకున్నారు.



అనంతపురంలో పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు వచ్చిన ఉద్యోగులు

పోలింగ్ సామగ్రితో కేంద్రానికి వెళ్తున్న ఉద్యోగి

ఎన్నికల్లో పాల్గొనేందుకు సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రమే వెళ్లారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోల వద్ద రిపోర్టు చేసుకుని తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లను సరిచూసుకున్నారు. వారికి సంబంధించిన ఎన్నికల సామగ్రిని అంతటినీ తీసుకున్నారు. కొత్తగా ఎన్నికల విధుల్లోకి వచ్చిన వారు తమ సన్నిహిత సిబ్బందితో సలహాలు, సూచనలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఉద్యోగులతో కిటకిటలాడింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌కు సమయం ఆసన్నమైంది. నేటి ఉదయం ఏడు గంటల నుంచే పోలింగు ప్రక్రియ మొదలు కానుంది. ఈ మేరకు పోలింగ్ సిబ్బందికి ఆదివారం నాడే ఇవిఎం యంత్రాలను అప్పగించారు. వాటిని అందుకున్న పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు ఆదివారం సాయంత్రమే చేరుకున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలు పెట్టే విధంగా ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు చేశారు. ఎక్కడ సాంకేతిక సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను ఆయా మండల కేంద్రాల్లోనూ ఏర్పాటు చేశారు.

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ కలిపి మొత్తం 2236 పోలింగ్ కేంద్రాలున్నాయి.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

పోలింగ్ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. అనంతపురం జిల్లాల్లో ఎన్నికల భద్రతా అధికారులు 2744 కాగా, కేంద్ర భద్రా బలగాలు 2125 మంది ఉన్నారు. వీరు కాకుండా ఎన్‌సిసి, రిటైర్డు, స్పెషల్ పోలీసులు కలిపి మొత్తం 440 మంది భద్రతా సిబ్బందిని అనంతపురం జల్లాలో

మిగతా 3లో

జిల్లా : అనంతపురం	
నియోజకవర్గాలు :	08
అసెంబ్లీ అభ్యర్థులు :	113
పార్లమెంట్ :	21
మొత్తం ఓటర్లు :	20,18,162
పురుషులు :	9,97,792,
స్త్రీలు :	10,20,124
ఇతరులు :	246
పోలింగ్ కేంద్రాలు :	2236
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు :	662

జిల్లా : శ్రీ సత్యసాయి	
నియోజకవర్గాలు :	06
అసెంబ్లీ అభ్యర్థులు :	78
పార్లమెంట్ :	13
ఓటర్లు :	16,56,775
పురుషులు :	8,24,048
స్త్రీలు :	8,32,51
ఇతరులు :	08
పోలింగ్ కేంద్రాలు :	1571
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు :	299




అనంతపురంలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



పెనుకొండలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఓటు వజ్రాయుధమే..!



మనల్ని పాలించే నేతలను మనమే ఎన్నుకునేందుకు ప్రజాస్వామ్యం మనకు కల్పించిన హక్కు. ఆ హక్కును నేడు వినియోగించుకోవాల్సిన సమయం అసన్నమైంది. పరిపాలించే పాలకుడి నిర్ణయించి గద్దెనెక్కించే అవకాశం ఓటు ద్వారా వస్తుంది. అందుకు ఓటును వజ్రాయుధం లాంటిది అంటారు. అలాంటి వజ్రయుధాన్ని నేడు పోలింగ్ కేంద్రంలో వినియోగించాలి. పోలింగ్ కేంద్రంలో గటల తరబడి ఎక్కడ వేచి ఉంటాం.. ఎండలో మేము నిల్చోలేం.. మనం ఒక్కరూ ఓటు వేయకపోతే ఏమైనా దేశానికి నష్టం జరుగుతుందా... ఇలాంటి సోమరతనం మాటలన్నింటినీ పక్కన బెట్టి ఓటెత్తాలి. ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే ఓటును కచ్చితంగా వినియోగించుకోవాలి. స్థానిక సమస్యలు పరిష్కారం కావాలన్నా, ప్రశ్నించే అధికారం రావాలన్నా... ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరాలన్నా... ఓటే ఆయుధం అన్న సంగతిని మరిచిపోరాదు. అందుకే సోమవారం నాడు జరిగే పోలింగ్‌లో అందరం ఓటేసి ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవడంలో ముందడుగు వేద్దాం...

వార్త 2లో

ఈవీఎంను తెరిచిన ఏపీఎం

గుత్తిలో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత



పోలింగ్ బూత్ వద్ద గుమిగూడిన జనం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని బహార్ పేట్ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ (182 పోలీస్ స్టేషన్) వద్ద ఆదివారం సాయంత్రం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎన్నికల అధికారులు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను తెరవాల్సి ఉండగా, అక్కడ ఉన్న సహాయ పోలింగ్ అధికారి (ఏపీవో) హేమచంద్రారెడ్డి ఈవీఎంల సీల్ ను ఎవరూ లేకుండా తెరిచారు. దీంతో వైసిపి ఏజెంట్లు, నాయకులు అక్కడికి చేరుకుని ఎన్నికల అధికారులతో వాదనకు దిగారు. సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబీరసూల్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి వైసిపి, టిడిపి నాయకులతో మాట్లాడారు. పోలింగ్ ప్రారంభ సమయానికి ప్రస్తుతం తెరిచిన ఈవీఎంలు స్థానంలో నూతన ఈవిఎంలు ఏర్పాటు చేస్తామని సిఐ హామీ ఇవ్వడంతో ఇరు పార్టీల నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.





ఓటు వజ్రాయుధమే

భారత ఎన్నికల సంఘం పోలింగ్ పక్రియకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నా ఓటింగ్ దాన్ని మాత్రం పెంచలేకపోతోంది. ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం అనేక ప్రయత్నాలు.. విస్తృత ప్రచారం చేస్తున్నా ఇంకా కొన్ని పట్టణాల్లో నిస్తేజం వీడడం లేదు. ప్రధానంగా యువతే ఓటెయడానికి ఆసక్తి చూపడం లేదనే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.. యువతలో ఎందుకింత నిర్లిప్తత? ఓటేయ్యడానికి ఎందుకే అనాసక్తి ఈ నిర్లక్ష్యాన్ని వీడాలి. పోలింగ్ రోజున ఓటేత్తాలి.. రాజ్యాంగం ఇచ్చిన హక్కును వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి.

ప్రజాశక్తి - అనంతపురం

మీ చేతిలోనే జిల్లా భవిత
నిర్లిప్తత విడనాడాల్సిందే..
అప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లుతుంది
రాజ్యాంగం ఇచ్చిన హక్కు సార్థకం అవుతుంది

ఓటింగ్ శాతాన్ని పెందలేకపోతోంది

ఎన్నికల సంఘం పోలింగ్ ప్రక్రియకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నా ఓటింగ్ శాతం పెరగడం లేదు. ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం అనేక ప్రయత్నాలు విస్తృత ప్రచారం చేస్తున్నా ఇంకా కొన్ని పట్టణాల్లో నగరాల్లో నిస్తేజం వీడడం లేదు. ఈ సారి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారి ప్రత్యేక దృష్టి సారించి ఓటు హక్కు విలువపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు.

జాగింగ్ కు వెళ్లకపోయినా పర్వాలేదు

పోలింగ్‌రోజు జాగింగ్‌కు వెళ్లకపోయినా పర్వాలేదు. గంటల తరబడి సెల్‌ఫోన్లలో కబుర్లకు కాస్త పుల్‌స్టాఫ్ పెట్టండి. సెలవు కదా అని దూరంగా ట్రిప్ వేసుకోమాకండి. దూరదృష్టి ఉన్న నేతను ఎన్నుకోవడం ప్రధానం అని గమనించండి. నేను ఓటు వేయకపోతే ఏం అన్న నిర్లక్ష్యంతో ఉండకండి. మీరు ఓటేయ్యకపోతే ఐదేళ్లు ఇబ్బంది పడాల్సిందే.. కదలండి.. వచ్చి ఓటేయండి... చూపుడు వేలుపై సిరా చుక్క వేయించుకుని ఫొటో వాట్సప్‌లో అప్‌లోడ్ చేయండి.

ఆసక్తి చూపడం లేదు

ప్రధానంగా పట్టణాల్లో యువతీ ఓటువేయడానికి ఆసిక్తి చూపడం లేదు. ఎందుకీ నిర్లప్తత. బైకులపై, టీషర్టులపై ఐ లవ్ ఇండియా అని రాతలు రాసుకుని దేశభక్తిని చాటుకోవడమే కాదు. దేశ భవిష్యత్తును చాటే 'ఓటుహక్కు" ను వినియోగించి తమపై ఉన్న దురభిప్రాయాన్ని పారదోలండి. పోలింగ్ రోజున దేశంపై ఉన్న ప్రేమను మరోసారి గుర్తు చేసుకోండి. తల్లిదండ్రులు, సినియర్ సిటిజన్లు, పెద్దలు కదలండి.. కదలించండి...



అసలు ఓటేందుకు వేయాలంటే...

దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్నా, మన గ్రామం అభివృద్ధి చెందాలన్నా, ఓ నియోజకవర్గం అభివృద్ధి కావాలన్నా అంతిమంగా మన సమాజం మెరుగుపడాలన్నా మనకంటే మన నేతలు నీతిమంతులై ఉండాలి. సమర్థవంతమైన ప్రభుత్వం అధికారంలో ఉండాలి. అందుకే అలాంటి వారిని ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రజా స్వామ్య దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరి బాధ్యత ఓటెయ్యడం... ఒకరిని ఓడించడమో. లేదా మరోకరిని గెలిపించడమో కాదు ఎన్నికలంటే. పౌరులంతా భాగస్వామ్యం కావాల్సిన ప్రజాస్వామ్య యుద్దం ఎన్నికలు.

ఓటేస్తేనే గుర్తింపు

ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం నేతను ఎన్నుకున్నా, వ్యతిరేకించినా అది ఓటుతోనే సాధ్యం.. కాలేజీకి వెళ్లామంటే హాజరు తీసుకుంటారు. అది విద్యార్థి ఉనికి కోసం. ఆఫీసుకు వెళ్లామంటే రిజిస్టర్‌లో సంతకం తీసుకుంటారు. అది ఉద్యోగ ఉనికి కోసం. మరి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ప్రతి పౌరుడికి ఉనికి. ఓటేస్తేనే నీ ఉనికి తెలుస్తుంది. అందుకే కదులుదాం.. ఓటేద్దాం...

ఓటుకుందీ... పవర్.?

ఎన్నికల్లో ఓటేయలేదంటే ఐదేళ్లపాటు ప్రశ్నించే హక్కును కోల్పోయినట్లే.. ఆ వ్యక్తి అవినీతి పరుడు అని విమర్శించే హక్కును కోల్పోతావు. విమర్శించనూ లేవు. రోడ్లు బాగాలేవని..గుంతలు పడ్డాయని.. తాగునీరు రావటం లేదని.. కరెంట్ సరఫరా కావటం లేదని... లంచాలు తీసుకుంటున్నారని పిర్యాదు చేయలేం. బాధ్యత లేని వారికి ప్రశ్నంచే హక్కు ఉండదు. అందుకే ఓటేయి...

చాటింగ్ చేసినంత సమయంలో

నిత్యం ఉదయం నుంచి రాత్రి పడుకునేంతవరకు సెల్‌తో బిజీ నేటి యువత. సెల్‌ఫోన్లో చాటింగ్ చేసినంత సమయం పట్టదు ఓటేయడానికి. ఓటు వేయడానికి ఎన్నికల సంఘం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. సెల్‌లో బాతాఖానీలకు, కబుర్లకు కాస్తంత బ్రేక్ ఇవ్వండి. వరుసలో నిల్చొని ఓపికతో ఓటేస్తే మన సమాజం ఎలా ఉండాలన్నది నిర్ణయించడానికి మీరే నిర్ణేతలు అవుతారు.

మంచి అభ్యర్థిని ఎంచుకో...

పార్టీలు, అధిష్టానాలు ఎక్కడో ఉంటాయి.. అగ్రనేతలు అల్లంత దూరాన ఉంటారు. మన సమాజం.. మనకు అందుబాటులో ఉండే నాయకుడే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా ఇతనే మన జీవితాలపై తక్షణ ప్రభావం చూపించే వ్యక్తి కనుక అయితే మంచిది. అతని వ్యక్తిత్వం, చదువు, నేర చరిత్ర, గుణగణాలు పరిశీలించండి. గతంలో చట్టసభల్లో అతని ప్రవర్తన, ప్రజాసమస్యలపై అతను స్పందించే తీరు, ప్రజాజీవితాన్ని పరిశీలించండి. మంచి వ్యక్తినే ఎన్నుకోవాలి. మన ప్రాంతం, మన సామాజికవర్గం, మనవాళ్లకు కావాల్సిన వాడు, ఉద్యోగం ఇస్తాడు అనే ధోరణితో కాకుండా విచక్షణతో ఆలోచించి ఓటేయ్యాలి. సాధ్యమైనంత వరకు పోలింగ్‌రోజున తొందరగా వెళ్లి వరుసలో నిల్చొని ఓటేయ్యండి..

కారణాలు చెప్పకు నేస్తమా...

హోటల్లో ముప్పై రూపాయలు పెట్టి తిన్న టిఫిన్ బాలోలేకపోతే నానా యాగీ చేస్తాం. రెండున్న గంటల సినిమా చూడాలంటే ఎసీ ఉందా.. ఫ్యాన్ దగ్గర సీటు ఉందా.. కార్నర్ సీటా అని చూసుకుంటాం. మరి దేశాన్ని, రాష్ట్రాన్ని, జిల్లాను పరిపాలించే నేతలను ఎన్నుకోవాలంటే ఇంకెంత దీక్ష ఉండాలి. 'నాకు టైం లేదు' అని సాకుచెప్పకండి. ఓటరు ఐడి దొరకలేదని చెప్పకండి. టీవీలో మంచి సినిమా వస్తుందని నిర్లక్ష్యం చేయకండి. 'పోటీ చేస్తున్న వారిలో నాకు ఎవరూ నచ్చలేద'ని చెప్పకండి. నచ్చని వ్యక్తులు పోటీలో ఉంటే కనీసం నోటాకైనా ఓటేయ్యండి. అంతేకాని ఓటేయ్యనని మాత్రం కారణాలు చెప్పకండి...

అభ్యర్థుల్లో 'ఓటు' గుబులు

అందరి ప్రచారాలకు బ్రహ్మరథం
ఓటరు నాడి తెలియక అయోమయం

ప్రజాశక్తి-హిందూపురం

శాసనసభ, లోక్‌సభకు హిందూపురం నియోజకవర్గం నుండి బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటు గుబులు పట్టకుంది. ఓటరు నాడి తెలియక అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. ఐదేళ్లు రాజకీయ నేతలు ప్రజలను పరిపాలిస్తూ ప్రజలకు గుబులు పుట్టిస్తే, పోలింగ్ రోజు మాత్రం అన్ని పార్టీల నేతలకు ఓటర్లు గుబులు పుట్టిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుండి నందమూరి బాలకృష్ణ పోటీ చేస్తుండగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి కురుబ దీపిక కాంగ్రెస్ నుండి ఎంహెచ్ ఇనాయతుల్లా, ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా పరిపూర్ణానంద స్వామి బరిలో ఉన్నారు. మొత్తం 13 మంది పోటీలో ఉన్నటికి ఈ నలుగురు మధ్యలో పోటీ ఉంది. ప్రదానంగా బాలకృష్ణ, దీపికలు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నారు. వీరందరికి ప్రచారానికి పట్టణ, గ్రామీణ మండలాల ప్రజలు బ్రహ్మరథం పడుతూ హారతులు ఇస్తూ వచ్చారు. నందమూరి బాలకృష్ణ, బాలయ్య సతీమణి వసుంధర, సోదరి లోకేశ్వరి తదితరులు చేపట్టిన ప్రచారాలకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీపిక తరపున పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభకు ప్రజలు అధికంగా హాజరైయ్యారు. ఇంతమంది ప్రజలు వచ్చారన్న సంతోషంలో అభ్యర్థులు ఉన్నారు. దీంతో గత నాలుగు రోజులుగా ఇరు పార్టీల వారు విచ్చల విడిగ డబ్బులను సైతం పంచారు. సమావేశాలకు, డబ్బులు తీసుకున్న వారంత ఓటు వేస్తారా అన్న అనుమానంలో అభ్యర్థులు పడ్డారు. ఓటు అనే హక్కుతో తల రాతలను మార్చే శక్తి ఉన్న ఓటర్లు ఇప్పుడు అభ్యర్థుల తలరాతలను రాయడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే కొన్ని చోట్ల డబ్బులు, మద్యం తదితర వస్తువులను ఓటర్లకు పంచుతున్న వారిపై కేసులు సైతం నమోదు చేశారు. అయినప్పటికి వాటిని లెక్క చేయకుండా ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. డబ్బులు తీసుకున్న వారంతా ఓటు వేస్తారనే నమ్మకం కూడా అభ్యర్థుల్లో కలగడం లేదు. దీంతో పాటు అధికార వైసిపికి కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్నా ఇనాయతుల్లా ఎక్కువ ఓట్లు చీల్చే అవకాశాలు ఉంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నా పరిపూర్ణానంద స్వామి టిడిపి ఓట్లు చేల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదో నేడు జరుగబోవు ఎన్నికల్లో తేలనుంది.

గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు చోట్ల గుట్టు చప్పుడు కాకుండా ప్రధాన పార్టీలు డబ్బులు పంపిణీ చేస్తున్నారని విశ్వనీయ సమాచారం. ఆదివారం చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి నాయకులు ప్రణాళిక బద్ధంగా పకడ్బందీగా నగదు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఓటరు లిస్టు దగ్గర పెట్టుకుని ఆయా వార్డుల స్థాయిలో ఆయా పార్టీల నాయకులు ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో గుర్తించి ఇరు పార్టీలు ఒక్కో ఓటుకు రూ. 2వేల చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. ఈసారి ఇరు పార్టీలు స్థానికనాయకులపై ఆధారపడకుండా పక్కాగా తమకు అత్యంత సన్నిహితుల ద్వారా నగదు పంపిణీ చేపటినట్లు తెలుస్తోంది. నాయకులు ఇల్లు చూపించడం చేస్తే ఓటర్ లిస్ట్‌లో ఆ ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో గుర్తించి నగదును పంపిణీ చేసినట్లు సమాచారం.కొన్నిచోట్ల పూర్తిగా ఫలానా పార్టీ వారు అని ముద్ర పడిన వారికి ఆయా పార్టీల వారు మాత్రమే డబ్బు పంచిపెట్టినట్లు తెలిసింది. తటస్థంగా ఉన్న ఓటర్ల నాడి అంతుచిక్కనందున ఇరుపార్టీల వారు నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. మొత్తం మీద గత రెండు రోజులుగా పక్కాగా ప్రణాళికలు వేసుకుని ఇరు పార్టీలు నగదు పంపిణీ చేయడంలో పూర్తి సఫలీకృతమయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన సార్వత్రిక ఎన్నికల 2024 డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్ బాబు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఆరు మండలాల ఎన్నికల సిబ్బంది తమ విధులకు హాజరై, వారికి కేటాయించిన ఎన్నికల సామాగ్రిని తీసుకుని వారికి కేటాయించిన వాహనాలలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రూట్ ఆఫీసర్లు పోలింగ్ సామాగ్రిని నిర్ణీత ప్రణాళిక ప్రకారం పోలింగ్ అధికారులతో ఆయారూట్ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు పోలీస్ భద్రత ద్వారా వీలైనంత త్వరగా చేరుకోవాలని సూచించారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేసి ఓటింగ్ ప్రక్రియ విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ, తహశీల్దార్ వేణుగోపాల్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న ఆర్‌ఒ రాణి సుస్మిత

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా అమలుచేయాలి : ఆర్‌ఒ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆర్‌ఒ రాణి సుస్మిత ఆదేశిం చారు. పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఎన్నికల అధికారులు సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. 261 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పిఒలు, ఏపీవోలు, ఓపిఒలకు 25 రూట్ల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని చేరవేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో 34 సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచామన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలన్నారు.

రామానుజాచార్యుల జయంతి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వైష్ణవ సమాజం ఆధ్వర్యంలో రామానుజాచార్యుల జయంత్యుత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రామానుజాచార్యుల చిత్రపటానికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమానికి అడియన్ స్వామిదాసన్ రామమూర్తి స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాయదుర్గం వైష్ణవ, హిందూ బాంధవులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని 54 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ రామాంజనమ్మ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు నీడ ఏర్పాటు చేశామన్నారు. భారీకేడ్లు, విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సదుపాయాలు కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఓటర్లు, ప్రజలు సహకరించి పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్ స్లిప్పులను ప్రతి ఇంటికి చేర్చామని తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు సమిష్టిగా పనిచేద్దాం

దిశ డీఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి మడకశిర

సమిష్టిగా శ్రమించి పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేద్దామని దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం డీఎస్పీ మడకశిర రూరల్ సిఐ రాజకుమార్, టౌన్ సిఐ మనోహర్‌తో కలిసి నియోజకవర్గంలో పోలింగ్ విధులకు వెళ్తున్న సెక్టార్ పోలీసు అధికారులు, రూట్ ఆఫీసర్లు, సిబ్బందితో పట్టణంలోని ఎస్‌వైటిఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో సోమవారం(నేడు) జరిగే పోలింగ్ ప్రక్రియలో ఏమి చేయాలో, ఏమి చేయకూడదో దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రిసైడింగ్ అధికారుల అనుమతి మేరకు నడుచుకోవాలన్నారు. క్యూ మెయింటెనెన్స్, ఓటర్లతో మర్యాదగా వ్యవహరించడం, తదితర విషయాలపై సూచనలు చేశారు. సమావేశంలో అమరాపురం, అగళి, రొళ్ల, గుడిబండ ఎస్‌ఐలు జయరామనాయుడు, వీరేష్, రాజశేఖర్, ముని ప్రతాప్ పాల్గొన్నారు. ఎన్నికల విధుల్లో జిల్లా పోలీసులు 64 మంది, సాయుధ బలగాలు 82, కర్నాటక రాష్ట్ర పోలీసులు 189తో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



పోలీసులతో సమావేశమైన దిశ డీఎస్పీ శ్రీనివాసరావు

స్ట్రాంగ్ రూముల్లో పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్ట్రాంగ్ రూముల వద్ద తక్షణం పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని జెఎన్టీయూలో సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో పెండింగ్ ఉంచకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ సీజ్ చేసేటప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రతి బ్లాక్లో కంట్రోల్ రూమ్ ఉండాలని, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులంతా వారికి కేటాయించిన బాధ్యతలను సజావుగా నిర్వహించాలన్నారు. స్టేషనరీ కోసం ప్రత్యేకంగా డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిఅండ్‌డి ఈవీఎంల స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసి, అక్కడ ఏ విధమైన ఏర్పాట్లు చేపట్టారో ఆరా తీశారు. తదనంతరం నగరంలోని తపోవనంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో అన్ని కనీస సౌకర్యాలు ఉన్నాయా అంటూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జి.రామకష్ణారెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గం ఎఆర్‌ఒ రమేష్ రెడ్డి, నోడల్ అధికారులు ఉమామహేశ్వరమ్మ, ప్రభాకర్ రావు, రఘునాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, అప్పాజీ, మధుసూదన్, వెంకటేశ్వర్లు, భాస్కర్, గురుస్వామిశెట్టి, రసూల్, చౌదరి, ఖుషఉ్బ కొఠారి, నాగయ్య, ఆనంద్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజి తరువాయి

పోలింగ్‌కు రెడీ

సమస్యల్లేకుండా ఓటింగ్ సజావుగా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. సమస్యాత్మకం అనుకున్న 1239 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారానూ ఓటింగ్ నిర్వహిస్తున్నారు.

అనంతలో అసెంబ్లీకి 113, శ్రీసత్యసాయిలో 78 మంది..

పార్లమెంటుకు అనంత 21.. శ్రీ సత్యసాయి 13 మంది...

అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. వీటన్నింటికి కలిపి మొత్తం 113 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. ఇక అనంతపురం పార్లమెంటుకు 21 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. 20,18,162 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నేడు వినియోగించుకోనున్నారు. ఇక సత్యసాయి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 78 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. హిందూపురం పార్లమెంట్‌కు 13 మంది బరిలో ఉన్నారు. 16,56,775 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగే ఓటింగ్ ద్వారా ఓటర్లు వారికి నచ్చిన వారికి ఓటు వేసి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపనున్నారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి ఈనెల 11వ తేదీ ప్రచారాల ద్వారా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. ఇక అంతిమ తీర్పు ఓటరు చేతుల్లో ఉంది.

ఓటు హక్కు వినియోగించుకోనున్న వందేళ్లపైబడిన వారు...

వందేళ్లు పైబడిన వారూ ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అనంతపురం జిల్లాలో 31 మంది వందేళ్లు పైబడిన ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా ఉరవకొండలో 9 మంది ఉండగా, రాప్తాడులో ఎనిమిది మంది ఉన్నారు. గుంతకల్లులో ఏడుగురు, తాడిపత్రిలో ఇద్దరు, రాయదుర్గంలో ఇద్దరు, శింగనమల, అనంతపురం, కళ్యాణదుర్గంలో ఒక్కొరు ఉన్నారు. 85 సంవత్సరాలుపైబడిన ఓటర్లు అనంతపురం జిల్లాలో 9732 మంది ఉన్నారు. వయసు పైబడిన వారు, నడవలేని వారుంటే ముందుగా దరఖాస్తుకుని ఉంటే ఇంటి వద్దనే ఓటింగ్ తీసుకునే విధంగా ఈసారి ఎన్నికల సంఘం నిర్ణయం చేసింది. ఈ విధంగా ఇప్పటికే కొంత మంది ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకుని ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్(34) ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. తన ఇంటి వద్ద ఉన్న పంచాయతీ కొళాయిలో నీరు అరకొరగా వస్తుండడంతో వినోద్‌కుమార్ విద్యుత్ మోటార్ పంపు ద్వారా నీటిని సంపులోకి పంపడానికి ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. ఇది గమనించని వినోద్‌కుమార్ నీటిలోకి దిగడంతో షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలపారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతందన్నారు. జిల్లాలో అత్యధిక ఓటింగ్ శాతం సాధించడానికి ప్రతి ఓటరూ సహకరించాలని కోరారు. ప్రశాంతంగా ఓటింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా, నిర్భయంగా, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పోలింగ్ విధులను నిర్వహించాలని సూచించారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది, పోలీసులు, కేంద్ర ప్యారామిలిటరీ బలగాలకు, మాజీ సైనికులు, ఎన్సీసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వారి విధులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని కోరారు. పోలింగ్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఓటరు కార్డు లేకపోయినా.. భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 12 గుర్తింపు కార్డుల్లో.. ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎన్‌పిఆర్ కింద ఆర్‌జిఈ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పాస్ పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, దివ్యాంగుల గుర్తింపు కార్డు లలో ఏదైనా ఒక గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రం పీవోకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చున్నారు. ఎన్నికల అక్రమాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1950 కు ఫిర్యాదు చేయవచ్చున్నారు.

వైసిపి కార్యాలయం వద్ద ఓట్లకు నోట్ల లొల్లి..!

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పలు వార్డులకు చెందిన మహిళలు ఓటుకు డబ్బులు పంచకుండానే... పంచామని చెబుతున్నారంటూ ఆదివారం రాత్రి హిందూపురం వైసిపి కార్యాలయం ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. 6వ వార్డు ధర్మపురం, హస్నాబాద్, అహమ్మద్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది వైసిపి కార్యాలయం వద్దకొచ్చి ఆందోళన చేశారు. ఉదయం నుంచి డబ్బులు పంచడానికి వస్తామని చెబుతూ ఇంతవరకు రాలేదన్నారు. ఇస్తే ఇస్తామని చెప్పాలి, లేకపోతే లేదు అని చెప్పాలి కానీ ఇలా చేయడం సరికాదన్నారు. డబ్బులు ఇవ్వకుండానే వార్డు కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జీలు చెబుతున్నారు. ఓటర్ల పేరు చెప్పి నాయకులు, కౌన్సిలర్లు డబ్బులు ఎలా దోచుకుంటారన్నారు. తమకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని ఆయా వార్డులకు ఇచ్చిన డబ్బులను వెనక్కి తీసుకోవాలన్నారు. అక్కడ ఉన్న నాయకులు కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జులతో మాట్లాడి ప్రతి ఇంటికి డబ్బులు పంపిస్తామని చెప్పడంతో వారు వెనక్కి వచ్చారు.



వైసిపి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
సోమవారం 13
మే 2024

బరిలో వీరు.. గెలిచేది ఎవరు..!



సార్వత్రిక ఎన్నికల పోరు తుది ఘట్టానికి చేరింది. విజేతను నిర్ణయించే సమయం ఆసన్నమైంది. ఓటరు తన తీర్పుతో అభ్యర్థిని అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపనున్నారు. ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఈ సారి ఒక్కో నియోజకవర్గం నుంచి చాలా మందే పోటీలో ఉన్నారు. బరిలో నిలిచిన వారిలో ఎవరికి ఓటు వేయాలన్న దానిపై ఓటర్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారు.

◆ పోలింగే తరువాయి..
◆ అధ్యక్ష అనేదెవరో..?
◆ నేడు ఓటరు తీర్పు

సోమవారం నాడు జరిగే పోలింగ్‌లో ఓటు వేసి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి అనంతపురం జిల్లా అసెంబ్లీ బరిలో 113 మంది, పార్లమెంట్ 21మంది, శ్రీ సత్యసాయి జిల్లా అసెంబ్లీ 78 మంది, పార్లమెంట్ బరిలో 13 మంది పోటీలో ఉన్నారు. మరి వీరిలో ఓటర్లు ఎవరిని గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపుతారో చూడాలి. ఎన్నికల ప్రధాన ఘట్టమైన పోలింగ్ సందర్భంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులను నియోజకవర్గాల వారీగా ఓ సారి తెలుసుకుందాం...

ప్రజాశక్తి-అనంతపురం డెస్క్




ఓటరు.. ఓటు..!

ఓటు ఓటరుకున్న హక్కు
ఓటు వేయని ఓటరు
తూటా లేని తుపాకీగాడు
ఓటు ఓటరుకున్న ఆయుధం
ఓటు కోసం వస్తాడు పోటీదారుడు
వంగి వంగి సలాములు చేస్తాడు
ఐదేళ్లకు ఒక్కసారి
ఇంటికెళితే కంటికి కనిపించడు
పోటీ కోసం పెట్టేను పార్టీ
పార్టీదారులంతా పోటీదారులే
పోటీదారులే పార్టీలు మారుతారు
పోటీదారులంతా ఒక్కటే
పార్టీల పేర్లు మాత్రమే వేరు
పోటీదారుల నియమమే అది
ఓటరు ఓటు పార్టీకి వేయాలా
ఓటరు ఓటు పోటీదారుకు వేయాలా
ఏ పార్టీ చూసిన ఏమున్నది గర్వకారణం
ఏ పోటీదారుకు వేసినా ఏమున్నది అభివృద్ధి
ఉచితాలకు ఉచితాలూ పోటీ తప్ప
ఉరితాళ్ల ఉచ్చులు వేయడం తప్ప
ఉన్నది ఉమ్మడిగా దోచుకోవడం తప్ప
తమ దగ్గరున్న ఆస్తి పాస్తులు
ఖర్చు పెట్టేవాడు లేడబ్బా
ఊరందరిది ఊడ్చి పెట్టే వాళ్లేనబ్బా
అందుకే ఓటరు ఆలోచించి వేయి ఓటు
ఒక్కసారి ఓటరు ఓటు వేస్తే
ఐదు ఏండ్లు అన్ని మూసుకుని బతకాలి
ఓటు వుండి ఓటు వేయకపోతే
ఓటుకుండ లాగు బతికే వాడివి

కలము: లీలాచంద్ర

ఈ గుర్తింపు కార్డులతో ఓటెయచ్చు..!

ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ ఓటరు కార్డును జారీ చేసింది. ఒక ఈ గుర్తింపు కార్డు అందుబాటులో లేకపోతే ఆ వ్యక్తికి సంబంధించిన ఏదేని గుర్తింపు కార్డును తీసుకుని పోలింగ్ కేంద్రంకు వెళ్లి ఓటు వేయవచ్చు. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ 12 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి ఇచ్చింది. ఈ కింద వాటిలో ఏదైని ఒక గుర్తింపు కార్డును తీసుకుని వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చు. అయితే ఓటరు జాబితాలో పేరు తప్పనిసరిగా ఉంటేనే ఓటు వేసేందుకు వీలు ఉంటుంది.

1.ఓటరు ఫొటో గుర్తింపు కార్డు
2.పాస్‌పోర్టు
3.డ్రైవింగ్ లైసెన్స్
4.సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులను గుర్తిస్తూ మంజూరు చేసిన గుర్తింపు కార్డులు)
5.ఫొటో కూడిన బ్యాంకు పాస్‌పుస్తకం
6.పాన్‌కార్డు
7.స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
8.ఎంఎన్ఆర్‌జిఇఎ జాబ్‌కార్డు
9.ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
10. ఫొటోతో పింఛను పత్రం
11.అధికారక గుర్తింపు కార్డు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసినవి)
12.ఆధార్ కార్డు



అనంతపురం నియోజకర్గం

అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 15 మంది బరిలో నిలిచారు. అధికార వైసిపి నుంచి అనంత వెంకటరామిరెడ్డి, టిడిపి నుంచి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇండియావేదిక సిపిఐ అభ్యర్థిగా జాఫర్ బరిలో ఉన్నారు. ప్రధానంగా ఈమూడు పార్టీల మధ్య పోరు సాగుతోంది. వీరితో పాటు పలు ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. సీనియర్ నేత కావడం, అనంతపురంలో గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుందని వైసిపి అభ్యర్థి అనంత భావిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు తనను గెలిపిస్తాయని టిడిపి అభ్యర్థి ప్రసాద్ ఆశాభావంతో ఉన్నారు. అనంతపురంలో వామపక్ష పార్టీలు చేసిన అలుపెరగని పోరాటాలు, కాంగ్రెస్ ఓటు బ్యాంకుతో ఈ సారి గెలిచి తీరుతామని సిపిఐ అభ్యర్థి జాఫర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.



శింగనమల నియోజకవర్గం

శింగనమల నియోజకవర్గంలో ఈ సారి పోరు రసవత్తంగా మారింది. అధికార వైసిపి కొత్త అభ్యర్థిగా వీరాంజినేయులును బరిలో నిలిపింది. ఇక టిడిపి గత ఎన్నికల్లో పోటీ చేసిన బండారు శ్రావణిశ్రీని మరోసారి నిలబెట్టింది. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఈ ముగ్గురు నేతల మధ్య పోరు నువ్వానేనా అన్నట్లు సాగుతోంది. వైసిపి కొత్త అభ్యర్థి అయినా ఆ పార్టీ ముఖ్యనేత వీరాంజినేయులు గెలుపు బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. ఇక టిడిపి అభ్యర్థి గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి, ఇంతకాలం నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నందున తానే గెలుస్తాననే నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ పదేళ్ల కాలంలో శింగనమలలో తాను చేసిన అభివృద్ధి ఎవరూ చేయలేదని అదే ఈ సారి తనను గెలిపిస్తుందని శైలజానాథ్ చెబుతున్నారు.



తాడిపత్రి నియోజకవర్గం

రాజకీయ రణక్షేత్రం తాడిపత్రిలో ఈసారి ఎన్నికలు యుద్ధవాతావరణాన్ని తలపిస్తున్నాయి. టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జెసి.అస్మిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన ఈయన ఈసారి ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిచి తాడిపత్రిలో జెసి కుటుంబానికి పూర్వవైభవం తేవాలన్న లక్ష్యంతో ఉన్నారు. అందుకు తగ్గట్టుగానే నియోజకవర్గం వ్యాప్తంగా ముమ్మర ప్రచారాలు చేశారు. ఇక వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. రెండోసారి జెసి కుటుంబంపై గెలిచి అసెంబ్లీకి వెళ్లాలని ఈయన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి జి.నాగిరెడ్డి బరిలో ఉన్నారు. తాడిపత్రిలో కాంగ్రెస్ పాత ఓటర్ల అందరూ ఈసారి తనను గెలిపిస్తారనే ధీమాతో ఈయన ఉన్నారు.



ఉరవకొండ నియోజకవర్గం

ఉరవకొండ ఓటర్ల తీర్పు ప్రతిసారి విలక్షణంగా ఉంటుంది. ఇక్కడి నుంచి గెలిచే అభ్యర్థి పార్టీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ఈ సారి టిడిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసిపి నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పోటీలో నిలిచారు. ఈసారి ఉరవకొండలోనూ టిడిపి, రాష్ట్రంలోనూ టిడిపి గెలుపు ఖాయం అని పయ్యావుల కేశవ్ చెబుతున్నారు. ఇదేరకంగా విశ్వేశ్వరరెడ్డి సైతం తన ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇద్దరు నేతలు నియోజకవర్గం వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలతో ప్రచారాలు చేశారు. ఇక కాంగ్రెస్ నుంచి విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో తనకున్న సంబంధాలతో ఈ సారి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని మధుసూదన్‌రెడ్డి ధీమాగా ఉన్నారు.



రాయదుర్గం నియోజకవర్గం

రాయదుర్గం నియోజకవర్గంలో ఎన్నికల వేడి తారాస్థాయిలోనే ఉంది. గత ఐదేళ్ల ఇక్కడ టిడిపి, వైసిపి నేతల మధ్య నిత్యం మాటల యుద్ధం నడిచింది. ఈ సారి ఎన్నికల్లో టిడిపి నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పోటీలో ఉన్నారు. ఐదేళ్ల పాటు వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ తాను చేసిన పోరాటాలు ఈ సారి గెలిపిస్తాయని కాలవ ఆశాభావంగా ఉన్నారు. వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని మార్చి ఆయన స్థానంలో మెట్టు గోవిందరెడ్డిని బరిలో నిలిపారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం, నియోజకవర్గంలో తనకున్న సంబంధాలతో గెలుపు ఖాయం అని మెట్టు భావిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి చిన్నప్పయ్య పోటీ చేస్తున్నారు. వైసిపి, టిడిపికి ధీటుగా పోటీలో ఉంటామని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



కళ్యాణదుర్గం నియోజకవర్గం

కళ్యాణదుర్గంలో ఈ సారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ప్రధాన పార్టీలు టిడిపి వైసిపి నుంచి కొత్త అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసిపి నుంచి అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను ఆ పార్టీ బరిలో నిలిపింది. నియోజకవర్గంలో తన సామాజిక వర్గం, బిసి సామాజిక వర్గం ఓట్లపై ఈయన నమ్మకంగా ఉన్నారు. ఇక టిడిపి నుంచి కొత్త అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు బరిలో ఉన్నారు. రాజకీయాలకు కొత్త అయినా అందరికి తాను తెలిసిన వ్యక్తినే అని, అందులోనూ కళ్యాణదుర్గం ప్రజలకు సుపరిచితుడని అమిలినే చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వం నియోజకవర్గంపై చేసిన నిర్లక్ష్యం తనను గెలిపిస్తుందని ఈయన భావిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా రాంభూపాల్‌రెడ్డి బరిలో ఉన్నారు. తన సత్తా చాటేలా ఎన్నికల ప్రచారం చేశాడు.



గుంతకల్లు నియోజకవర్గం

గుంతకల్లులో పాత,కొత్త నేతల మధ్య పోరు సాగుతోంది. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మరోసారి బరిలో నిలిచారు. ఐదేళ్ల సంక్షేమం, స్థానిక నేత కావడం తన గెలుపునకు దోహదం చేస్తాయని ఈయన భావిస్తున్నారు. ఇక టిడిపి నుంచి గుమ్మనూరు జయరాం పోటీలో నిలిచారు. కర్నూలుకు చెందిన ఈయన ఎన్నికల ముందు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈయన నియోజకవర్గానికి కొత్త అయినా టిడిపి శ్రేణులు అందరినీ కలుపుకుని ముందుకు సాగే ప్రయత్నం చేస్తున్నారు. టిడిపికి ఉన్న బలమైన క్యాడర్, ప్రభుత్వ వైఫల్యాలు తనను గెలిస్తాయని ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రభాకర్ కూడా ఈ సారి ఎన్నికల్లో సత్తా చాటేలా ముమ్మర ప్రచారం చేశారు. టిడిపి, వైసిపికి గట్టి పోటీ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.



రాప్తాడు నియోజకవర్గం

రాప్తాడులో ఎన్నికలు ఎప్పుడూ యుద్ధాన్ని తలపిస్తుంటాయి. ఈ సారి కూడా అదే పరిస్థితి కన్పిస్తోంది. టిడిపి నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత మరోసారి బరిలో నిలిచింది. నియోజకవర్గంలో బలమైన టిడిపి క్యాడర్, పరిటాల కుటుంబం అభిమానులు ఉండడంతో ఈ సారి గెలుపు తథ్యం అని ఈమె భావిస్తున్నారు. ఇక వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యే అయ్యేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. ఆ సారీ పరిటాల కుటుంబాన్ని ఓడిస్తాననే ధీమాను ఆయన వ్యక్తం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి ఆదిఆంధ్ర శంకరయ్య బరిలో ఉన్నారు. అగ్రవర్ణాల పాలనకు స్వస్తి చెప్పి ఆ సారి ఓ దళితునికి పట్టం కట్టేందుకు రాప్తాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన భావిస్తున్నారు.



ధర్మవరం నియోజకవర్గం

ఈ సారి ధర్మవరం నియోజకవర్గం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మూడవ సారి పోటీ చేస్తున్నారు. తాను చేసిన అభివృద్ధి ఎవరూ చేయలేదని, నిత్యం ప్రజలతో ఉన్న తననే ధర్మవరం ప్రజలు గెలిపిస్తారని ఆయన ధీమాగా ఉన్నారు. ఇక ఎన్డీఏ కూటమి బిజెపి అభ్యర్థిగా సత్యకుమార్ బరిలో ఉన్నారు. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా లాంటి నాయకులతో ఆయకున్న పరిచయాలతో ఈ సారి ధర్మవరంలో బిజెపి జెండాను ఎగురవేస్తానని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రంగన అశ్వర్థ నారాయణ పోటీలో ఉన్నారు. చేనేత సామాజిక వర్గం నేత కావడంతో ధర్మవరంలో ఆ సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈయన కూడా గెలుపుపై ధీమాగా ఉన్నారు.



పెనుకొండ నియోజకవర్గం

ఈ సారి పెనుకొండలో ఇద్దరు మహిళల మధ్య ప్రధాన పోటీ నడుస్తోంది. ఇద్దరు మహిళలు ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు కావడం విశేషం. వైసిపి నుంచి మంత్రి ఉషశ్రీచరణ్ బరిలో ఉన్నారు. కళ్యాణదుర్గం నుంచి ఈమె పెనుకొండకు వచ్చారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిపైనే ఈమె ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. టిడిపి నుంచి సవితమ్మ పోటీ చేస్తున్నారు. స్థానిక నేత కావడం, నియోజకవర్గంలో విస్తృతమైన పరిచయాలు ఉండడం తనకు కలిసి వస్తుందని ఈమె ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బోయ నరసింహప్ప పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఓటర్లు ఈ సారి కాంగ్రెస్‌ను ఆదరిస్తారనే ధీమాతో ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రచారాలు నిర్వహించారు.



మడకశిర నియోజకవర్గం

ఎస్సీ రిజర్వు నియోజకవర్గం అయిన మడకశిరలో ఈ సారి హోరాహోరీ పోరు సాగుతోంది. వైసిపి రెండవ సారి ఈ నియోజకవర్గంలో జెండాను ఎగురవేయాలని చూస్తోంది. అందులో భాగంగా ఈరలక్కప్ప అనే సాధారణ వ్యక్తిని బరిలో నిలిపింది. నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నేతలంతా ఈయన గెలుపునకు ప్రచారాలు చేస్తున్నారు. ఇక టిడిపి కొత్త అభ్యర్థిగా ఎంఎస్.రాజును పోటీలో నిలిపింది. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌తో ఈయనకు ఉన్న పరిచయాల నేపథ్యంలో టిడిపి శ్రేణులను కలుపుకుని ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇక ఈ నియోజకర్గంలో కాంగ్రెస్ తన సత్తాను చాటుతోంది. పోటీలో ఉన్న సుధాకర్ ఈ సారి గెలవబోతున్నాడని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈయనకు మద్దతుగా మాజీ పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు.



హిందూపురం నియోజకవర్గం

రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన నియోజకవర్గం హిందూపురం. నందమూరి తారక రామారావు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన కేంద్రం. ప్రస్తుతం ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ మూడవ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నందమూరి కుటుంబంపై హిందూపురం ప్రజలకు ఉన్న అభిమానం, టిడిపి పాలనలో చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుందని ఆయన ధీమాగా ఉన్నారు. వైసిపి నుంచి కొత్త అభ్యర్థిగా దీపిక బరిలో ఉన్నారు. వైసిపి అందించిన సంక్షేమంతో ఈసారి బాలయ్య కోటను కూలుస్తామని ఆమె విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంహెచ్.ఇనయతుల్లా ముస్లిం నేతగా బరిలో ఉన్నారు. మారిన సమీకరణల దృష్ట్యా పెద్ద ఎత్తున తనకు ఓట్లు వస్తాయని ఆయన ధీమాగా ఉన్నారు. ఇక్కడి నుంచి స్వామి పరిపూర్ణానంద కూడా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు.



కదిరి నియోజకవర్గం

కదిరిలో ఈ సారి పోటీ నువ్వానేనా అన్నట్లు సాగుతోంది. టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మూడవ సారి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో విస్తృతమైన పరిచయాలు, సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేసిన నేతగా గుర్తింపు ఉన్న తనను ఈసారి కదిరి ప్రజలు ఆశీర్వదిస్తారని ఆయన ధీమాగా ఉన్నారు. ఇక వైసిపి నుంచి కొత్త అభ్యర్థిగా మగ్బుల్ బరిలో ఉన్నారు. మైనార్టీ ఓట్లు అధికంగా ఉండడం, వైసిపి చేసిన అభివృద్ధితో ఈ సారి తన గెలుపు ఖాయం అని ఆయన విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా షాన్వాజ్ పోటీ చేస్తున్నారు. ఈయన కూడా ముస్లిం నేత కావడంతో అత్యధికులు కాంగ్రెస్ వైపునే నిలుస్తారనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పుట్టపర్తి నియోజకవర్గం

కొత్త జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఎన్నికల పోటీ రసవత్తరంగానే సాగుతోంది. వైసిపి, టిడిపి అభ్యర్థులు గెలుపుకోసం నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఈ సారి టిడిపి నుంచి పల్లె రఘునాథరెడ్డి స్థానంలో ఆయన కోడలు పల్లె సింధూర పోటీలో నిలిచారు. పల్లె రఘునాథరెడ్డికి నియోజకవర్గంలో ఉన్న బలమైన అభిమానులు, టిడిపి శ్రేణుల మద్దతుగా సారి సింధూర విజయం సాధిస్తుందని ధీమాగా ఉన్నారు. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దుకంట శ్రీధర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఐదేళ్ల పాటు స్థానికంగా ఉండడం, అందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చడం తన గెలుపునకు దోహదం చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా డి.మధుసూదన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. పుట్టపర్తిలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉండడం ఈ సారి తన గెలుపును దోహదం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అనంతపురం పార్లమెంట్

అనంతపురం పార్లమెంట్‌కు సంబంధించి ఎన్నికల వేడి తారాస్థాయిలోనే ఉంది. ఈ నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున మాలగుండ్ల శంకర నారాయణ, టిడిపి నుంచి అంబికా లక్ష్మినారాయణ, కాంగ్రెస్ నుంచి మల్లికార్జున పోటీలో ఉన్నారు.ప్రధానంగా టిడిపి, వైసిపి, కాంగ్రెస్ మధ్య పోటీ ఉంది. వైసిపి అభ్యర్థి శంకర నారాయణ మంత్రిగా పని చేసిన అనుభవం, అనంతపురం పార్లమెంట్ పరిధిలోని తనకున్న వ్యక్తిగత పరిచయాలు, వైసిపి చేసిన అభివృద్ధి గెలిపిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. ఇక టిడిపి అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ సామాజిక వర్గం ఎక్కువగా పార్లమెంట్ పరిధిలో ఉండడం, వైసిపిపై ఉన్న వ్యతిరేకత తనకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్‌పై ప్రజల్లో అభిమానం పెరిగిందిదని, వామపక్ష ఉద్యమాలు కలిసొచ్చి తాము గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు.



హిందూపురం పార్లమెంట్

హిందూపురం పార్లమెంట్‌లోనూ ఈసారి పోటీ రసవత్తరంగా సాగుతోంది. బరిలో హేమాహేమీలు ఉన్నారు. ఈ స్థానం నుంచి వైసిపి అభ్యర్థిగా కర్నాటకకు చెందిన శాంతమ్మను బరిలో నిలిపింది. గతంలో ఈమెకు కర్నాటక నుంచి ఎంపీగా గెలుపొందిన అనుభవం ఉంది. ఇక టిడిపి అభ్యర్థిగా పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి ఉన్నారు. గతంలోనూ ఈయన హిందూపురం ఎంపీగా గెలుపొందారు. సీనియర్ నేతగా అయిన ఈయనకు హిందూపురం పార్లమెంట్ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. బిసి సామాజిక వర్గం నేత కావడంతో తాను ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందుతానని ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి షమద్ షాహీన్ ఎన్నికల బరిలో ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉండడం తనకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు.

ప్రజాశక్తి

పోలింగ్‌కు సర్వం సిద్ధం





పోలింగ్‌కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా లోని 7 అసెంబ్లీ స్థానాలకు ఒక పార్లమెంటు స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించిన సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. జిల్లాలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా హిందూపురం పార్లమెంటు స్థాన పరిధిలో ఉన్నాయి. ఇందులో రాప్తాడు నియోజకవర్గం సగం సత్యసాయి జిల్లాలో సగం అనంతపురం జిల్లాలో ఉంది. జిల్లాలో 16, 56, 775 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 8,32,651 పురుషులు 8,24,048 మంది ఉన్నారు. ఇందులో 100 ఏళ్ల పైబడినవారు 13 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 1571 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సమస్యాత్మక కేంద్రాలు 299 ఉన్నాయి. వెబ్ కాస్టింగ్ ద్వారా నిఘా ఉంచిన పోలింగ్ కేంద్రాలు 923 ఉన్నాయి. 13వ తేదీన బ్యాలెట్ ఈవీఎంలను మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించి హిందూపురం సమీపంలోని మలుగూరు గ్రామం వద్ద గల బిట్స్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములలో పటిష్టమైన భద్రతతో భద్రపరుస్తారు. అలాగే పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గలకు లేపాక్షి మండలంలోని చోళ సముద్రం వద్దగల డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈవీఎంలను భద్రపరుస్తారు. జూన్ 4న అక్కడే ఓట్లు లెక్కింపు చేపడతారు. 13న జరగబోయే ఎన్నికలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల నుంచి ఎన్నికల సామాగ్రిని తరలించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

కొత్తచెరువు రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ కళావతి తెలిపారు మండల వ్యాప్తంగా 38 పోలింగ్ కేంద్రాలలో 32,700 మంది ఓటర్లు వారి యొక్క ఓటు హక్కును వినియోగించు కోనున్నారన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంకాలం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు ఆయా కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడే కానీ గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కదిరి అర్బన్ : సోమవారం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఎన్నికల సామాగ్రి పంపిణీ పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంశీకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల వెళ్లాల్సిన అధికారులు సామాగ్రి తో వెళ్లారన్నారు. ఆదివారం రాత్రి కి పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలని కల్పించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధులను అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని15 పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ సరస్వతి సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ నీటి సౌకర్యం తదితర వాటిపై ఆరా తీశారు.

హిందూపురం : సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆద్వర్యంలో పటిష్టంగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం పట్టణంలోని ఎంజిఎం ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రి, ఈవిఎం, వివి ప్యాట్ ల పంపిణీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద పెద్దపెద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతకు ఇబ్బంది లేకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు.. నియోజకవర్గంలో హిందూపురం పురపాలక సంఘం, రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు సంబందించి 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు అందుకు తగిన రీతిలో సిబ్బందిని కేటాయించి, వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు బస్సులతో పాటు, ప్రైవేటు వాహనాలను ఉపయోగించారు. ఇదే సందర్భంగా సిబ్బందికి ఈవిఎం, వివి ప్యాట్ లను ఎలా ఉపయోగించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పటిష్టమైన బందోబస్తు : ఎస్పీ

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్త్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి మాధవ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ వ్యాప్తంగా చేపట్టిన బందోబస్త్ పై వివరాలను డిఎస్‌పి కంజాక్షన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాస్, ఈరన్న, శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్



మాట్లాడుతున్న కందికుంట

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అన్యాయానికి, ప్రజా స్వామ్యానికి జరుగు తున్న ఎన్నికలని నియోజకవర్గ ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని కదిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాల్లో అండగా నిలబడ్డానని చెప్పారు. నియోజకవర్గ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారానికి పోరాటం చేశామన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం సబ్‌జైలును జిల్లా జడ్జి శ్రీనివాస్ ఆదివారం తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాలమేరకు జిల్లాలోని సబ్‌జైళ్ల తనిఖీల్లో భాగంగా ధర్మవరం సబైజైలును జిల్లా జడ్జి శ్రీనివాస్ తనిఖీ చేసినట్లు సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా జడ్జీ సబ్‌జైలులో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. సబ్ జైలులో సక్రమంగా భోజనం అందిస్తున్నారా, వసతులు ఉన్నాయా తదితర విషయాలను వారిని అడిగితెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే చెప్పాలన్నారు. న్యాయవాది లేకపోతే తాము ఏర్పాటుచేస్తామని ఆయన ఖైదీలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : ఎస్పీ



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా సర్వం సిద్ధం చేశామని పోలీసులు విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలోని ఆయా నియోజక వర్గాలలో గల అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించడమే తమ లక్ష్యమని ఇందుకోసం కేంద్ర సాయుధ బలగాలతో పాటు జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని అన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయం లో అప్రమత్తంగా ఉంటూ, వృద్ధులు, వికలాంగులు, మహిళలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తోడ్పడాలని తెలిపారు. జిల్లాలో 1873 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో 299 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అక్కడ మరింత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లు , ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించామని, బారికేడింగ్ ఉండే విదంగా సంబందిత అదికారులతో సమన్వయం చేసుకొని వెళ్లాలని చెప్పామన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల ఎవరూ గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలతో సంబంధంలేని వ్యక్తులను పోలింగ్ బూత్‌లలోకి అనుమతించబడదని, విధులలో ఉన్నవారు తప్పనిసరిగా మంజూరు చేసిన అనుమతి పాసును దగ్గర పెట్టుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్నీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలను కేటాయించడం జరిగిందని,ఈ ఎన్నికలకు 13 కంపెనీల సిబ్బంది వచ్చారని అన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియను అంతా సిసి కెమెరాలతోను, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏదైనా అనుకోనిసంఘటన జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

కమాండ్ కంట్రోల్ ద్వారా నిత్యం పర్యవేక్షణ..

పోలింగ్ జరుగుతున్న కేంద్రాలలో సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకోవడానికి కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేపట్టామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్నికల నిమిత్తం కంట్రోల్ ద్వారా సిబ్బందిని ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా నిత్యం అక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అక్కడికి ప్రత్యేక టీములు చేరుకునే విధంగా ఈ కమాండ్ కంట్రోల్ పనిచేస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సమస్యలు ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండి తెలుసుకోవాలని సిబ్బందికి సూచించినట్లు ఎస్పీ చెప్పారు. సైబర్ సెల్ సిఐ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ ద్వారా నిత్యం పర్యవేక్షణ చేసే విధంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి , సిసి రాఘవేంద్ర, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

యువకులు, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆద్వర్యంలో యువకులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంఇఒ, ఎపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నేడు యువకులు, విద్యార్థులు మైదానంలో జరిగే క్రీడలపై ఎక్కువ అసక్తి కనబర్చడం లేదన్నారు. కేవలం ఇంటర్ నెట్, సెల్ ఫోన్‌లో పబ్జిలు, ఫ్రీఫైర్ ఇతర గేమ్స్ కు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ఉమర్ ఫారూఖ్ ఖాన్ యువకులకు, విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, చైతన్య గంగిరెడ్డి,ఉబెదుల్లా హుసేన్, పైల్వాన్ ఫయాజ్, దాదు, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలపై కొడవలితో దాడి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో శనివారం ఆర్ధరాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. భర్తే తన సొంత భార్య, ఇద్దరు అత్తలపై కొడవలితో దాడి చేసి, నరకి చంపడానికి యత్నించారు. ఈ దాడిలో నవీన్ కుమార్ రెడ్డి భార్య మీనా, అత్త కుర్మిణి, చిన్న అత్త రాజమ్మ గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. వీరిలో రాజమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. బాధితులు తెలిపిన వివరాలు... 10 సంవత్సరాల క్రితం నవీన్ కుమార్ రెడ్డి మీనా అనే మహిళను కులాంతర వివాహం చేసుకున్నాడు. మొదట వీరి సంసారం సాఫీగా సాగింది.కొన్ని సంవత్సరాల అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డి రోజు తాగి వచ్చి గొడవ చేస్తుండడంతో మీనా తన భర్తను వదిలేసి పుట్టింట్లో ఉంటోంది. భర్తతో విడాకుల కోసం మీనా కోర్టును ఆశ్రయించింది. కొద్ది రోజుల క్రితం నవీన్‌కుమార్‌రెడ్డి తన భార్య మీనా తండ్రి వద్దకు వెళ్లి తాగుడు మానేస్తానని భార్యా పిల్లలను బాగా చూసుకుంటానని నమ్మబలికాడు. దీంతో వారు మీనాను తిరిగి భర్త వద్దకు పంపారు. అయితే ఇచ్చిన మాట తప్పిన నవీన్‌కుమార్‌రెడ్డి రోజూ మద్యం తాగి వచ్చి ఇబ్బంది పెడుతుండడంతో మీనా తిరిగి పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి రాజీ చేసుకుని భార్యను తీసుకెళ్తానంటూ కొంతమంది స్నేహితులతో వచ్చిన నవీన్‌కుమార్‌రెడ్డి కొడవలితో భార్య, అత్తలపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో

ఎన్నికలకు అంతా సిద్ధం..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్‌కు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల పరిధిలోని పోలింగ్ బూత్‌లకు ఈవిఎంలు, వివి ప్యాట్‌లు, తదిత పోలింగ్ సామగ్రితో ఎన్నికల అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ ప్రక్రియకు సన్నద్ధమయ్యారు. సోమవారం(నేడు) ఓటు వేసేందుకు ఓటర్లు సమాయత్తమయ్యారు. ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అలాగే ఎన్నికల సిబ్బంది, ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. ఇక ఉమ్మడి జిల్లాలో మొత్తం నియోజకవర్గాలు, ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి..

నియోజకవర్గం : హిందూపురం
మండలాలు : 3
మొత్తం ఓటర్లు : 2,49,174
పురుషులు : 1,24,730
మహిళలు : 1,24,425
ఇతరులు : 19
బరిలో నిలిచిన అభ్యర్థులు : 13
పోలింగ్ కేంద్రాలు : 253
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 44

నియోజకవర్గం : రాప్తాడు
మండలాలు : 6
మొత్తం ఓటర్లు : 2,50,571
పురుషులు : 1,25,028
మహిళలు : 1,25,531
ఇతరులు : 12
బరిలో నిలిచిన అభ్యర్థులు :
పోలింగ్ కేంద్రాలు : 281
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 134

నియోజకవర్గం : అనంతపురం
మండలాలు : జిల్లా కేంద్రం
మొత్తం ఓటర్లు : 2,81,214
పురుషులు : 1,37,708
మహిళలు : 1,43,479
ఇతరులు : 27
బరిలో నిలిచిన అభ్యర్థులు : 15
పోలింగ్ కేంద్రాలు : 292
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 85

నియోజకవర్గం : తాడిపత్రి
మండలాలు : 4
మొత్తం ఓటర్లు : 2,48,880
పురుషులు : 1,23,496
మహిళలు : 1,25,358
ఇతరులు : 26
బరిలో నిలిచిన అభ్యర్థులు : 18
పోలింగ్ కేంద్రాలు : 274
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 180

నియోజకవర్గం : పెనుకొండ
మండలాలు : 5
మొత్తం ఓటర్లు : 2,35,986
పురుషులు : 1,17,952
మహిళలు : 1,18,030
ఇతరులు : 4
బరిలో నిలిచిన అభ్యర్థులు : 9
పోలింగ్ కేంద్రాలు : 265
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 31

నియోజకవర్గం : కదిరి
మండలాలు : 6
మొత్తం ఓటర్లు : 2,53,420
పురుషులు ఓటర్లు : 1,24,650
మహిళ ఓటర్లు : 1,28,762
ఇతరులు : 8
ఒరిలో నిలిచిన అభ్యర్థులు : 13
పోలింగ్ కేంద్రాలు : 281
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 46

హిందూపురం పార్లమెంటు
బరిలో నిలిచిన అభ్యర్థులు : 13

అనంతపురం పార్లమెంటు
బరిలో నిలిచిన అభ్యర్థులు : 21

నియోజకవర్గం : రాయదుర్గం
మండలాలు : 5
మొత్తం ఓటర్లు : 2,64,352
పురుషులు : 1,30,794
స్త్రీలు : 1,33,516
ఇతరులు : 42
బరిలో నిలిచిన అభ్యర్థులు : 13
పోలింగ్ కేంద్రాలు : 296
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 24

నియోజకవర్గం : ఉరవకొండ
మండలాలు : 5
మొత్తం ఓటర్లు : 2,24,339
పురుషులు : 1,10,540
మహిళలు : 1,13,771
ఇతరులు : 28
బరిలో నిలిచిన అభ్యర్థులు : 11
పోలింగ్ కేంద్రాలు : 263
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 152

నియోజకవర్గం : ధర్మవరం
మండలాలు : 4
మొత్తం ఓటర్లు : 2,45,758
పురుషులు : 1,21,764
మహిళలు : 1,23,974
ఇతరులు : 20
బరిలో నిలిచిన అభ్యర్థులు : 15
పోలింగ్ కేంద్రాలు : 290
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 10

నియోజకవర్గం : పుట్టపర్తి
మండలాలు : 6
మొత్తం ఓటర్లు : 2,11,062
పురుషులు : 1,04,164
మహిళలు : 1,06,886
ఇతరులు : 12
బరిలో నిలిచిన అభ్యర్థులు : 13
పోలింగ్ కేంద్రాలు : 241
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 50

నియోజకవర్గం : మడకశిర
మండలాలు : 5
మొత్తం ఓటర్లు : 2,10,804
పురుషులు : 1,05,760
మహిళలు : 1,05,043
ఇతరులు : 1
బరిలో నిలిచిన అభ్యర్థులు : 14
పోలింగ్ కేంద్రాలు : 241
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 42

నియోజకవర్గం : శింగనమల
మండలాలు : 6
మొత్తం ఓటర్లు : 2,47,373
పురుషులు : 1,22,927
మహిళలు : 1,24,417
ఇతరులు : 29
బరిలో నిలిచిన అభ్యర్థులు : 14
పోలింగ్ కేంద్రాలు : 293
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 133

నియోజకవర్గం : గుంతకల్లు
మండలాలు : 3
మొత్తం ఓటర్లు : 2,67,036
పురుషులు : 1,31,304
మహిళలు : 1,35,656
ఇతరులు : 76
బరిలో నిలిచిన అభ్యర్థులు : 14
పోలింగ్ కేంద్రాలు : 276
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 108

నియోజకవర్గం : కళ్యాణదుర్గం
మండలాలు : 5
మొత్తం ఓటర్లు : 2,30,785
పురుషులు : 1,14,356
మహిళలు : 1,16,422
ఇతరులు : 7
బరిలో నిలిచిన అభ్యర్థులు : 15
పోలింగ్ కేంద్రాలు : 261
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు : 34

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా పెనుకొండ-158 అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్వోతో కలిసి డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎన్నికల అధికారులు, తదితరులు ఉన్నారు.

మడకశిర : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఎస్‌వై డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సందర్శించారు. పోలింగ్ సిబ్బంది, అధికారుల హాజరు, వారికి అధికారులు చేపట్టే కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బందికి, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. ఉదయం నుంచే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిటర్నింగ్ అధికారి అన్ని చర్యలు చేపట్టారు.



మడకశిరలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి : జెసి కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏర్పాట్లు పూర్తయినట్లు అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం రాయదుర్గంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈవిఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శిం చారు. ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ తీరు గురించి రిటర్నింగ్ అధికారి కరుణకుమారిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈవిఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రా లను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, అన్నిచోట్ల ఈవీఎంల పంపిణీ ప్రక్రియ పూర్తయిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఉదయమే అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిఆర్పిఎఫ్ బలగాలు మొహరించినట్లు తెలిపారు. అన్నిచోట్ల వెబ్ కాస్టింగ్ జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల లోగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతించరన్నారు. ఎవరైనా తీసుకొస్తే సీజ్ చేస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. సెక్టార్ అధికారులను రిజర్వ్ చేసినట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. జెసితో పాటు జెడ్పి సీఈవో వైఖోమ్ నదియాదేవి, రిటర్నింగ్ అధికారి కరుణకుమారి, తదితరులు ఉన్నారు.



రాయదుర్గంలోని ఈవిఎంల పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి కేతన్ గార్గ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

'జగన్ వెన్నంటే ఉన్నా అన్యాయం చేశారు'

కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

జగన్ కుటుంబం వెంట నడిచిన తనకు అన్యాయం జరిగిందని తాజా మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను మోసం చేసిన వారికి ప్రజలు ఏ విధంగా బుద్ధి చెబుతారో ప్రజలే విజ్ఞతకే వది లేసినట్లు తెలిపారు. కాపు ఆదివారం పట్టణం లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయాల్లోకి రాకముందు 2009లో కంటి ఆపరేషన్లు, ట్యాంకర్లతో నీటి సరఫరా, బియ్యం పంపిణీ, డిగ్రీ కళాశాలకు బస్సు సర్వీస్, 7వేలకు పైగా ఉచిత వివాహాలు, కంటి వైద్య శిబిరాలు, వికలాంగులకు వెయ్యికి పైగా వాహనాల పంపిణీ, ఆత్మహత్య చేసు కున్న రైతు కుటుంబాలకు, గుళ్ళ, గోపురాలకు ఆర్థిక సాయం, తదితర సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. కరోనా ఉధృతంగా ఉన్న సమయం లో భార్యతో కలిసి రాయదుర్గంలో ప్రజలకు అండగా ఉండి సేవలు, సాయం చేశామన్నారు. శుభకార్యాలు, చావులు, తదితర కార్యక్రమాల పేరుతో నెలలో పాతిక రోజులు ప్రజలకు అందు బాటులో ఉండి ఇంట్లో పెద్ద కుమారుడిలా సేవ చేశానన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు, యువతను ప్రోత్సహించే కార్యక్రమా లు చేపట్టామన్నారు. రాజకీయాల విషయాని కొస్తే జగన్ పార్టీ పెట్టాక శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి వెన్నుదన్నుగా నిలిచానన్నారు. 2012, 2014 ఎన్నికల్లో టికెట్ వద్దన్నప్పటికీ ఇచ్చారన్నారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశానన్నారు. 2019 ఎన్నికల సమయం లో జగన్ మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. రాయదుర్గంలో వైసిపిని బలోపే తం చేయడంతో పాటు పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టానన్నారు. జగన్ జైల్లో ఉన్నప్పు డు షర్మిల 3,250 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే నా భార్య కాపు భారతి ఆమె వెంట పాద యాత్ర చేశారన్నారు. జగన్ సిఎం అయ్యాక తన అన్న గెలిచాడని రాయదుర్గం నుంచి తిరుమల వరకూ నా భార్య పాదయాత్ర చేసి మొక్కు చెల్లించిందన్నారు. 2012, 2014, 2019 ఎన్నికల్లో ఖర్చు కోసం ఆస్తులు అమ్ముకున్నానని తెలిపారు. అయితే కొందరు పెద్దమనుషులు జగన్ వద్దకు వెళ్లి కాపు వద్ద డబ్బులు లేవని ఎమ్మెల్యే టికెట్ రాకుండా అడ్డుకున్నారని, అయినా తనకు ఎలాంటి బాధ లేదన్నారు. 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి గౌరవం కల్పించి నందుకు రాయదుర్గం ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పార్టీ ధర్మం పాటిస్తూ వైసిపిలో ఉన్నప్పుడు మాట్లాడిన వీడియోలను నేడు వైసిపి నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేసి పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

సోషల్ మీడియాలో వైసిపి తప్పుడు ప్రచారం
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనంతపురం అర్బన్ స్థానానికి సిపిఐ అభ్యర్థి జాఫర్ కంకి కొడవలి గుర్తుకు, పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి పాలమల్లి మల్లికార్జున హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా అనంతపురం నగరంలోని శ్రీశ్రీనగర్ కాలనీ పట్టాల కోసం 12ఏళ్లుగా సిపిఎం ఆందోళనలు చేసిందన్నారు. ఫలితంగా 2023 మే 18న అధికారులు ఇంటి పట్టాలు ఇచ్చారు. అప్పట్లో జరిగిన సభలో తాను మాట్లాడిన ఉపన్యాసాన్ని వైసిపి సోషల్ మీడియాలో ఇప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పట్టాలు ఇచ్చిన సందర్భంగా అధికారులను, శాసనసభ్యులను గౌరవిస్తూ మాట్లాడిన విషయాలను పోలింగ్‌కు ఒక్క రోజు ముందు పోస్ట్ చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నించడం బాధాకరమన్నారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ కలిసి ఇండియా కూటమిలో భాగంగా పోటీ చేస్తున్నప్పుడు సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులు పెట్టి గందరగోళాన్ని సృష్టించి లబ్ధి పొందాలని చూడటాన్ని ఓటర్లు గుర్తించాలని కోరారు.

ప్రజలారా ఆలోచించి ఓటేయండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్



ప్రజాశక్తి-అనంపుతరం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలారా.. నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆలోచించి ఓటేయాలని టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తాను రాజకీయాలు చేయడానికో.. డబ్బు సంపాదించుకోవడానికో ఇక్కడికి రాలేదని, తనకు అనంతపురం నగరం ఎంతో ఇచ్చిందని.. ఈప్రాంతానికి సేవ చేయాలని వచ్చానన్నారు. అంతేగాకుండా రాష్ట్ర భవిష్యత్ కోసం మీరు మంచి వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. నగరాన్ని ఎవరైతే అభివృద్ధి చేస్తారో.. ఎవరైతే ప్రజలకు అండగా ఉంటారో అలాంటి వ్యక్తినే ఆదరించాలన్నారు. చదువుకున్న వారు, ఉద్యోగులు, మేథావులు, పెన్షనర్లు ఓటుహక్కు కలిగిన విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొని స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వన్‌టౌన్ సిఐ రెడ్డెప్ప తెలిపారు. ఈమేరకు ఆదివారం నగరంలోని నీరుగంటి వీధిలో ఉన్న భగత్‌సింగ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద కేంద్ర సాయుధ బలగాల సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసి ఇవిఎంలు స్ట్రాంగురూములకు తరలి వెళ్లేంత వరకూ సిబ్బంది బందోబస్తు ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌ను నియమించినట్లు తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికల బందోబస్తు



బెలుగుప్ప : మండల వ్యాప్తంగా పోలింగ్‌కు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 43 పోలింగ్ కేంద్రాలకు 80 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎలిపారు. ముఖ్యంగా మండలంలో సమస్యాత్మక తగ్గుపర్తి, కోనాపురం, బెలుగుప్ప, వెంకటాద్రిపల్లి గ్రామాలకు సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని నియమించారన్నారు. వీరికి అదనంగా ఒక్కో కానిస్టేబుల్ ఉండారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేగాక నియోజవర్గానికి ఇద్దరు డిఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

సర్వం సిద్ధం

పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు తరలిన సిబ్బంది



ఉరవకొండలో ఎన్నికల సామగ్రితో సిబ్బంది

ప్రజాశక్తి-గుంతకల్లు

సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు ఆదివారం తరలివెళ్లారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ప్రధాన అధికారి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఇవిఎంలు, వివిప్యాడ్స్‌తో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గంలో గుంతకల్లు, గుత్తి, పామిడి అర్బన్, రూరల్ పరిధిలో 2,67,036 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్ఓ తెలిపారు. వీరికి 1,31,304 మంది పురుషులు, 1,31,356 మంది మహిళలు, 76 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల కోసం 276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 29 రూట్ అధికారులను, 29 సెక్టార్ అధికారులు, ఎన్నికల విధులకు 1979 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇందులో 319 మంది పోలింగ్ అధికారులు, 332 మంది సహాయ పోలింగ్ అధికారులు, 1328 మంది ఒపిఓలను, 62 మంది మైక్రో అబ్జర్వర్లు, 36 వెబ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 35 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నార్పల : మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ రాముడు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 56 పోలింగ్ కేంద్రాలు, 32 లోకేషన్లు కలిగి ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల వద్ద ఓటర్ల సహాయార్థం మైక్‌సెట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బూత్ వద్ద ఓటర్ల సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక బిఎల్ఒ, ఒక అంగన్వాడీ కార్యకర్త అందుబాటులో ఉంటారన్నారు. మండలంలో ఎవరైనా వికలాంగులు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటే అలాంటి వారి కోసం వీల్‌ఛైర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల దూరంలో వివిధ పార్టీల వారు ఏర్పాటు చేసే ఓటర్ల సహాయ కేంద్రంలో ఎలాంటి పార్టీ జెండాలు, పార్టీ రంగులు, పార్టీ కరపత్రాలు కానీ ఉంచరాదన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు.

వజ్రకరూరు : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈమేరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, ఆర్ఓ కేతన్‌గార్గ్ పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో తరలివెళ్లారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 263 ఉండగా 2,800 మంది సిబ్బందిని కేటాయించారు. కాగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల అధికారి కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెలుగుప్ప : మండలంలో నేడు జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండల వ్యాప్తంగా 43 పోలింగ్ కేంద్రాల్లో 36,836 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున మండల వ్యాప్తంగా 268 మంది సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు.

పెద్దవడుగూరు : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 46పోలింగ్ కేంద్రాలు ఉండగా 36,911 మంది ఓటర్లు ఉన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక కిష్టిపాడు, అప్పేచెర్ల, పెద్దవడుగూరు, లక్షుంపల్లి, ముప్పాలగుత్తి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ గోపీకృష్ణతోపాటు సీఐ రోషన్, ఎస్ఐ ముత్యాలశ్రీనివాసులు తదితరులు పరిశీలించారు.

కాగా మండలంలోని సమస్యాత్మక పెద్దవడుగూరు, అప్పేచెర్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శిక్షణ కలెక్టర్ వినీత, రాష్ట్ర పరిశీలకులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు, పరిసరాలు, విద్యుత్తు తదితర అంశాలపై ఆరాతీశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచాలని అధికారులకు సూచించారు. వారి వెంట ఎస్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు రామేశ్వరరెడ్డి, కుళాయిస్వామి, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, తదితరులు ఉన్నారు.



బెళుగుప్పలో ఎన్నికలకు సామగ్రితో తరలుతున్న సిబ్బంది



పెద్దవడుగూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల కేంద్ర పరిశీలకులు

నిష్పక్షపాత ఎన్నికలకు చర్యలు : ఎస్పీ



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలింగ్ నిష్పక్షపాతంగా నిర్వహించేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించామని నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో జిల్లా అంతటా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మరింత నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ పోలీసులను నియమించామన్నారు. హింసరహిత ఎన్నికలే లక్ష్యంగా ముందస్తు చర్యలు తీసుకుని రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నియమ నిబంధనలు పక్కాగా అమలులో ఉంటాయని,. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు హక్కును వినియోగించు కోవడంలో ఎవరైనా ఆటంకపరిచినా... ప్రలోభాలకు గురి చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గొడవలు, అల్లర్లకు దిగి కేసుల్లో ఇరుక్కోకండని ప్రశాంతంగా ఉండాలని కోరారు. చట్టాన్ని అతిక్రమించడం... చట్టాన్ని చేతుల్లో తీసుకోవడం నేరమని, పుకార్లు, వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీళ్ల బాటిళ్లు, ఇంకు సీసాలు, బాల్ పెన్నులు, మొబైల్ ఫోన్లు, తదితర విలువైన వస్తువులేవి పోలింగ్ కేంద్రాలలోకి అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ జరిగే ప్రాంతాలలో సి.సి కెమేరాలు, బాడీ వార్న్ కెమేరాలతో నిఘా పెట్టామన్నారు. ఓటు వేసిన అనంతరం ప్రజలు ఆయా పరిసరాలలో గుంపులుగా గుమిగూడకుండా ఇళ్లకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా, సాఫీగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వేళ ఏవైనా సమస్యలు ఉంటే డయల్- 100 లేదా జిల్లా పోలీస్ ఎన్నికల విభాగం ఫోన్ నంబర్ 9392918293కు తెలియజేయాలన్నారు. ఓటుహక్కును ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్



పోలింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్

ప్రజాశక్తి-గుత్తి

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్నివిధాలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మండలంలోని తొండపాడులో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 173, 174, 175 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరిగే ఓటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 118 పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, ఇతర సామాగ్రితోపాటు పోలింగ్ అధికారులు చేరుకున్నారన్నారు. ఇవిఎంలలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే 20 నిమిషాల వ్యవధిలోనే ఆస్థానంలో మరో ఇవిఎం ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడువేల మందికిపైగా పోలీస్ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ సందడి



కదిరి అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఇవిఎం నమూనా



ఉరవకొండలో ఎన్నికలకు సామగ్రితో తరలుతున్న సిబ్బంది



బెళుగుప్పలో ఎన్నికలకు సామగ్రితో తరలుతున్న సిబ్బంది



గుంతకల్లులో ఎన్నికల సామగ్రిని సర్దుకుంటున్న సిబ్బంది



హిందూపురంలో ఇవిఎంలు, వివిప్యాట్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు





ఎన్నికల సిబ్బంది, పోలీసులకు అవగాహన కల్పిస్తున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్



అనంతపురంలో కేంద్ర బలగాలకు సమస్యలను వివరిస్తున్న సీఐ రెడ్డప్ప



హిందూపురంలో ఎన్నికలకు సామగ్రితో తరలుతున్న సిబ్బంది



గుత్తిలో ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్



నార్పల మండలంలో పోలింగ్ కేంద్రాన్ని ముస్తాబు చేసిన అధికారులు



పుట్టపర్తిలో ఎన్నికల సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి భాగ్యరేఖ